సాక్షి
రాజన్న సిరిసిల్ల
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఉచిత వైద్యశిబిరంలో మందులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కొనియాడారు. ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో వేములవాడ లయన్స్‌క్లబ్, సన్‌రైజర్స్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించి ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం వైద్యులతో కలిసి ప్రారంభించారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే కృతనిశ్చయంతో లయన్స్‌క్లబ్ ఉందన్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీని ప్రారంభిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ చీకోటి సంతోష్, సెక్రటరీ బచ్చు వంశీకృష్ణ, ట్రెజరర్ కోయినేని ప్రవీణ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగమల్ల శ్రీనివాస్, వైద్యులు కోయినేని రాజేందర్, నామాల ప్రదీప్, ఆనందరెడ్డి, సన్‌రైజర్స్ వైద్యులు కొండపాక కిరణ్‌కుమార్, ఉదయ్, నిర్వాహకులు సాయికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముత్యంరావు



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. తంగళ్లపల్లిలోని ఫ్రెండ్స్‌క్లబ్‌లో ఆదివారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. ముందుగా ర్యాలీ తీసి, ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన బస్వాపూర్‌కు చెందిన పంచాయతీ కార్మికుడు దాచారం భూమయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ముత్యంరావు మాట్లాడుతూ జీపీ సిబ్బందికి భారంగా మారిన మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని కోరారు. నాయకులు మల్యాల నర్సయ్య, ఎగమంటి ఎల్లారెడ్డి, మూషం రమేశ్, సూరం పద్మ, జవ్వాజి విమల, కంసాని రవి, నేరెళ్ల రాజు, అశోక్, కిరణ్ పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

30 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కోడం రమణ, జిల్లా అధ్యక్షుడిగా బుర్ర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మల్యాల నర్సయ్య, ఉపాధ్యక్షులుగా అన్నల్‌దాస్ గణేశ్, వర్కోలు మల్లయ్య, అక్కల అంజయ్య, లోకిని శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా నారాపురం నర్సయ్య, సందెల మహేశ్, మామిడి నరేశ్ ఏకగ్రీవమయ్యారు.


రాజన్నా శరణు..శరణు



దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా గర్భగుడి దర్శనాలు, అభిషేకాలు, అన్నపూజలు రద్దు చేశారు. లఘు దర్శనాలకు భక్తులు క్యూకట్టాల్సి వచ్చింది.

ఎల్‌ఎండీకి నీటి విడుదల



ఎల్‌ఎండీకి వెళ్తున్న నీరు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి 500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి మూలవాగు, మానేరువాగుల్లోంచి 400 క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా చేరుతోంది. మిడ్‌మానేరులో నీటిమట్టం 27.171 టీఎంసీలకు చేరింది.

ఇందిరా శక్తి.. నెలాఖరులోగా పూర్తి

- చివరి దశకు చేరిన చీరల బట్ట ఉత్పత్తి
- 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్లు
- ఇప్పటికే 3.75 కోట్ల మీటర్లు సేకరణ
- రాష్ట్రంలో 67 లక్షల మందికి చీరల పంపిణీ లక్ష్యం



ఇందిరా మహిళా శక్తి చీరల బట్టను ఉత్పత్తి చేస్తున్న నేత కార్మికుడు



చీరల వస్త్ర నాణ్యతను పరిశీలిస్తున్న మహిళలు

సిరిసిల్ల: ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట ఉత్పత్తి వేగంగా సాగుతోంది. ఉత్పత్తి లక్ష్యం ఎక్కువగా ఉండడంతో ఎన్ని గడువులు విధించినా పూర్తి కావడం లేదు. అక్టోబరు నెలాఖరులోగా వంద శాతం ఇందిరా మహిళా శక్తి చీరల బట్టను పూర్తి చేయాలని చేనేత, జౌళిశాఖ అధికారులు గడువు విధించడంతో ఉత్పత్తి వేగం పుంజుకుంది. సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో 9,600 పవర్‌లూమ్స్‌పై నిత్యం 4.80 లక్షల మీటర్ల మేరకు చీరల బట్ట ఉత్పత్తి అవుతుంది.

రెండు రకాల చీరలు

ఇందిరా మహిళా శక్తి పథకంలో రాష్ట్రంలోని 67 లక్షల మంది మహిళలకు ఏకరూప చీరలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు చీరలను డిజైన్ చేసి సిరిసిల్ల నేతన్నలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని వస్త్రోత్పత్తిదారులకు ఆర్డర్లు అందించారు. ఇందులో జరీ అంచు బార్డర్‌తో 6.30 మీటర్ల పొడవు ఉండే చీరలను 55 లక్షల మేరకు ఆర్డర్లు ఇవ్వగా.. మరో 12 లక్షల మేరకు 9 మీటర్ల గోచీ చీరలను ఆర్డర్లు ఇచ్చారు. 58 ఏళ్ల పైబడిన మహిళా సంఘాల్లోని వృద్ధులైన మహిళలకు గోచీ చీరలను అందించేందుకు సిరిసిల్ల లో 9 మీటర్ల పొడవు ఉండే చీరల ఆర్డర్లు ఇచ్చారు. ఈ చీరలు ఇక్కడే ఉత్పత్తి అవుతూ సిరిసిల్లలోనే ప్రాసెసింగ్ చేశారు. జరీ అంచుతో కూడిన పాలిస్టర్, కాటన్ మిక్స్ చీరలను సూరత్‌లో ప్రాసెసింగ్ చేశారు. రెండు రకాల చీరలను మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబరు 17న పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు వేర్వేరుగా సిరిసిల్లలో చీరల ఉత్పత్తిని పరిశీలించారు.

రెండు విడతల్లో ఆర్డర్లు

సిరిసిల్లలోని 131 మ్యాక్స్ సంఘాలకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చారు. సిరిసిల్లతోపాటు కరీంనగర్, హన్మకొండ జిల్లాల్లోనూ చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. కానీ సిరిసిల్లలో మెజార్టీ పవర్‌లూమ్స్ ఉండడంతో ఇక్కడే ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదటిసారి 2.12 కోట్ల మీటర్ల ఆర్డర్లు ఇవ్వగా.. రెండో విడతగా ఏప్రిల్‌లో మరో 2.12 కోట్ల మీటర్ల ఆర్డర్లు ఇచ్చారు. ఈ బట్ట ఉత్పత్తికి వేములవాడలో ప్రభుత్వం యారన్(నూలు) డిపో ఏర్పాటు చేసింది. నూలును నేరుగా కొనుగోలు చేసి బఫర్ స్టాక్‌గా ఉంచడానికి రూ.50కోట్ల కార్పస్ ఫండ్ మంజూరు చేసింది. సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు నూలును 90 శాతం అరువుపై సరఫరా చేసి చీరల బట్టకు నూలును అందించారు.

బతుకమ్మ చీరల కంటే నాణ్యతతో..

గతంలో బతుకమ్మ చీర ఖరీదు రూ.350 ఉండగా.. ఇందిరా మహిళాశక్తి చీర ఖరీదు రూ.480గా నిర్ధారించారు. ఈమేరకు నాణ్యమైన నూలును ప్రభుత్వం సరఫరా చేస్తూ బట్టను ఉత్పత్తి చేయిస్తోంది. పాలపిట్ట కలర్‌లో చీరను డిజైన్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి చీరల పంపిణీకి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

బట్ట ఉత్పత్తి వేగంగా సాగుతోంది



సిరిసిల్లలో చీరల బట్ట ఉత్పత్తి వేగంగా సాగుతోంది. మొదట్లో చీరల బట్టను ఉత్పత్తి చేసే సాంచాల సంఖ్య తక్కువగా ఉండగా.. మూడు నెలల్లో బాగా పెరిగాయి. బట్ట ఉత్పత్తిలో నాణ్యతను పెంచాం. గడువులోగా వంద శాతం చీరల బట్ట ఉత్పత్తి లక్ష్యం నెరవేరుతుంది. ఉత్పత్తి అయిన చీరల బట్టను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. చీరల ఉత్పత్తిపై రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

– రాఘవరావు, చేనేత, జౌళిశాఖ ఏడీ

కొచ్చగుట్టతండాకు దూరభారమేనా !

ఈ రోడ్డు 10 కిలోమీటర్లు



ఇది కొచ్చగుట్ట, అంబారిపేటతండాల నుంచి అంబారిపేటకు వెళ్లేందుకు వేస్తున్న దారి. ఈ దారి గుండానే రెండు తండాల ప్రజలు అంబారిపేట మీదుగా రుద్రంగి మండల కేంద్రానికి చేరుకోవాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు. అయితే ఇలా రుద్రంగికి రావాలంటే గిరిజనులకు 10 కిలోమీటర్లు అదనంగా తిరగాల్సి ఉంటుంది. దూరభారంతోపాటు సమయం కూడా వృథా అవుతుంది.

ఇదీ 2 కిలోమీటర్లే..



ఇది అంబారిపేట, కొచ్చగుట్టతండాల నుంచి పంటపొలాల మీదుగా.. దుర్గమ్మ ఆలయం ముందు నుంచి రుద్రంగికి చేరుకునే దారి. ఒక కిలోమీటరు దూరం గల ఈ రోడ్డుపై తారు వేసి, దుర్గమ్మ ఆలయం వద్ద గల ఒర్రెపై బ్రిడ్జి నిర్మిస్తే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రుద్రంగికి చేరుకుంటారు. ఈ రోడ్డును బాగుచేయాలని రెండు తండాల ప్రజలు కోరుతున్నారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు.

- కూతవేటు దారి కాదని..
- అంబారిపేట, కలికోట మీదుగా రోడ్డు నిర్మాణం
- దుర్గమ్మ గుడి రోడ్డు బాగు చేయాలంటున్న గిరిజనులు
- పట్టించుకోని అధికారులు

రుద్రంగి(వేములవాడ): దగ్గరి రోడ్డును కాదని దూరభారమైనా 10 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే అంటున్నారు అధికారులు. పొలాల మధ్యలో నుంచి ఉన్న మట్టిరోడ్డును తారురోడ్డుగా మారిస్తే రెండు కిలోమీటర్లు ప్రయాణించి రుద్రంగి మండల కేంద్రానికి చేరుకోవచ్చు. కానీ అధికారులు మాత్రం కూతవేటు దూరంలో ఉన్న రోడ్డును కాదని చుట్టూ తిరిగి వచ్చేలా రోడ్డు వేస్తుండడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రుద్రంగి మండలంలోని కొచ్చగుట్టతండా, అంబారిపేటతండాల ప్రజల రోడ్డు కష్టాలపై కథనం.



రుద్రంగి కొచ్చగుట్టతండా

పక్కనే ఉన్నా..

కొచ్చగుట్టతండా నుంచి మండల కేంద్రానికి చేరుకునేందుకు సరైన రోడ్డు లేదు. ఇన్నాళ్లు తండా ప్రజలు వినియోగించిన రోడ్డు సూరమ్మ ప్రాజెక్టులో ముంపునకు గురవుతుంది. దీంతో మండల కేంద్రానికి వచ్చేందుకు వీరి సరైన రోడ్డు లేకపోయింది. పొలాల మధ్య నుంచి వచ్చే మట్టి రోడ్డు బాగానే ఉన్నా దుర్గమ్మ ఆలయం వద్ద గల ఒర్రెపై బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలు సాగుతాయి. ఈ రోడ్డు మొత్తం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది.

చుట్టూ తిరగాల్సిందేనా..

నడుచుకుంటూ వచ్చేందుకు వీలున్న దారిని కాదనడంతో అంబారిపేట, కలికోట మీదుగా చుట్టూ తిరిగి బస్సులో ప్రయాణించి రుద్రంగికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దూరభారం పెరగడంతోపాటు సమయం వృథా అవుతుందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొచ్చగుట్టతండా రోడ్డు కోసం రూ.1.30 కోట్ల ట్రైబల్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రుద్రంగి అంబేడ్కర్ చౌరస్తా నుంచి హనుమాన్‌చౌరస్తా వరకు సీసీ రోడ్డు వేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. రుద్రంగి నుంచి కొచ్చగుట్టతండాకు వెళ్లే దారి సూరమ్మ ప్రాజెక్టులో ముంపునకు గురవుతుంది. అయితే కొచ్చగుట్టతండా నుంచి రుద్రంగిలోని పంటపొలాల మీదుగా దుర్గమ్మ ఆలయం వరకు తారు రోడ్డు వేసి, ఒర్రెపై బ్రిడ్జి నిర్మిస్తే రెండు కిలోమీటర్లు ప్రయాణించి రుద్రంగికి చేరుకోవచ్చు. కానీ అధికారులు మాత్రం అంబారిపేట మీదుగా రుద్రంగికి వచ్చేలా రోడ్డు వేస్తున్నారు. ఈ ప్లాన్‌ను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

నడుచుకుంటూ పోవచ్చు



కొచ్చగుట్టతండా నుంచి రుద్రంగికి దుర్గమ్మ దారి నుంచి నడుచుకుంటూ పోవచ్చు. ఆ దారిని కాదని అంబారిపేట నుంచి పోవాలంటే చుట్టూ తిరగాల్సిందే. దుర్గమ్మ గుడి ముందు నుంచి రోడ్డును బాగుచేసి ఒర్రెపైన బ్రిడ్జి కట్టాలే.

– గుగులోతు గౌరి, కొచ్చగుట్టతండా

గుడి ముందు తోవనే..



కొచ్చగుట్టతండా నుంచి రుద్రంగి వచ్చేందుకు ఇప్పుడు ఉన్న తోవ సూరమ్మ చెరువులో మునిగిపోతే దుర్గమ్మగుడి ముందు నుంచి పోయే తోవనే మంచిగా ఉంటుంది. కొచ్చగుట్టతండా నుంచి దుర్గమ్మగుడి వరకు అర కిలోమీటరు తారు రోడ్డు వేసి, ఒర్రె మీద బ్రిడ్జి నిర్మిస్తే సరిపోతది.

– గుగులోతు గోపాల్, కొచ్చగుట్టతండా

అంబారిపేట నుంచే రావాలి

కొచ్చగుట్టతండా దారి సూరమ్మ ప్రాజెక్టులో ముంపునకు గురైతే కొచ్చగుట్టతండా ప్రజలు అంబారిపేట నుంచే రుద్రంగికి రావాలి. మరే తోవ మా ప్రపోజల్‌లో లేదు. కొచ్చగుట్టతండాకు మంజూరైన రూ.1.30 కోట్లు దుర్వినియోగం కాలేదు. కొచ్చగుట్టతండా వద్ద అంబారిపేట రోడ్డుకు లింకు పనులు చేపట్టాం.

– సిరిమల్ల మాధురి, ఏఈఈ, ట్రైబల్ వెల్ఫేర్, రుద్రంగి



ఘనంగా కుంకుమ పూజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్ శివకేశవ ఆలయంలో ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు. వేదపండితులు విశ్వనాథశర్మ, కొండపాక శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

రాజన్నను దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి



అనుభాషణం చేస్తున్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామీ

- ఘనస్వాగతం పలికిన మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్
- పూర్ణకుంభ కలశంతో ఆలయ అర్చకుల స్వాగతం

వేములవాడ: ధర్మ విజయ యాత్రలో భాగంగా వేములవాడకు శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి ఆదివారం రాత్రి చేరుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే, ఈవో రమాదేవి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభ కలశంతో స్వామి వారికి స్వాగతం పలికారు. స్థానిక తెలంగాణచౌక్‌కు చేరుకున్న స్వామీజీ ప్రత్యేక రథంపై ఆసీనులయ్యారు. జేసీబీ సహాయంతో గజమాల వేశారు. ఒగ్గుడోలు, భజన మండలి కళాకారులు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. స్వామీజీని చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.



ఆలయంలో స్వాగతం పలుకుతున్న అధికారులు



హాజరైన భక్తులు

పెద్దమ్మ స్టేజీ వద్ద జిల్లాలోకి..

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి చేపట్టిన విజయ ధర్మ యాత్ర గంభీరావుపేట మండలం పెద్దమ్మస్టేజీ వద్ద జిల్లాలోకి ప్రవేశించింది. బాసర నుంచి వస్తున్న స్వామీ యాత్రకు పెద్దమ్మస్టేజీ, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.

ఈశ్వరుని సేవలో వైరుధ్యాలుండొద్దు

- శృంగేరి పీఠాధిపతుల సూచనలతోనే పనులు
- ఐకమత్యంతో అభివృద్ధికి సహకరించాలి
- శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి

వేములవాడ: ఈశ్వరుని సేవలో వైరుధ్యాలుండొద్దని, శృంగేరి పీఠాధిపతుల సూచనలు, సలహాలతోనే వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు జరుపుకోవాలని శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి అన్నారు. అందరూ ఐకమత్యంతో ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గుడి ఓపెన్‌స్లాబ్‌లో మహాస్వామి అనుభాషణం చేశారు. రాజన్న ఆలయం ఎంతో ప్రాచీనమైందని, సంకల్పంతో, శాస్త్రోక్తంగా ప్రభుత్వ సహకారంతో ముందుకు సాగాలన్నారు. అభివృద్ధి, విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో కాస్త ఇబ్బందులు ఉంటాయని.. పనులు పూర్తయిన తర్వాత వీటి ఫలితాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఆలయ పనులు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయని, ఇతర ప్రాంతాల అంశాలను ముడిపెట్టవద్దని సూచించారు. సందేహాలుంటే తమ వద్దకు రావొచ్చన్నారు.

పక్కా ప్రణాళికతో ఆలయ అభివృద్ధి

– రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

పక్కా ప్రణాళికతో ఆలయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ పనులు భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితుల సలహాలు, సూచనలతో జరుగుతున్నాయన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

బీసీలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను మభ్యపెడుతూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలు పొందే కుట్రతో ముందుకెళ్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆరోపించారు. సిరిసిల్లలోని తన నివాసంలో ఆదివారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను క్షమించబోరన్నారు. బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు 10 శాతం ఎందుకని కేంద్రమంత్రి బండి సంజయ్ మొదట్లోనే ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎవరిపైనా నిరసనలు తెలుపుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ ప్రకారం మంత్రివర్గంలో 8 మంది బీసీలు ఉండాలన్నారు. బీసీ మంత్రుల స్థానాల కోసం ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేయగలరా అని సవాల్ విసిరారు. బీసీ మహిళా మంత్రి కొండా సురేఖ ఇంటిపైకి పోలీసులను పంపడాన్ని సమర్థిస్తున్నారా అంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, మ్యాన రాంప్రసాద్, చొప్పదండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లిక్కర్ టెండర్‌కు మరో చాన్స్

- 23 వరకు గడువు పొడగింపు
- ఇప్పటి వరకు 1,324 దరఖాస్తులు
- రూ.కోటి తగ్గిన ఆదాయం
- జిల్లాలో 48 మద్యం దుకాణాలు

గతంలోని టెండర్ల వివరాలు

దరఖాస్తులు	: 2,036
ఫీజు	: రూ.2 లక్షలు
ఆదాయం	: రూ.40.72 కోట్లు

ప్రస్తుత టెండర్ల వివరాలు

దరఖాస్తులు	: 1,324
ఫీజు	: రూ.3లక్షలు
ఆదాయం	: రూ.39.72 కోట్లు



మద్యం టెండర్ వేస్తున్న వ్యాపారులు (ఫైల్)

సిరిసిల్లక్రైం: మద్యం టెండర్లు వేసేందుకు మరో అవకాశం దక్కింది. ఈనెల 23 వరకు లిక్కర్ టెండర్లకు గడువు పొడగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 48 మద్యం దుకాణాలకు 1324 దరఖాస్తులు రాగా.. రూ.39.72కోట్ల ఆదాయం సమకూరింది. శనివారంతో గడువు ముగిసిపోగా.. ప్రభుత్వం 23వ తేదీ వరకు పొడగించింది.

48 షాపులు.. 1,324 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 48 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించగా.. ఇప్పటి వరకు 1,324 దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షల చొప్పున ఫీజు చెల్లించగా, గతంలో ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలతో 2,036 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి మొత్తంలో తగ్గుదల కనిపించింది. మరో 712 దరఖాస్తులు తగ్గినట్లు తెలుస్తోంది. వీటితో రాష్ట్ర ఖజానాకు రూ.39.72కోట్లు వచ్చాయి. కానీ గత టెండర్లలో వచ్చిన ఆదాయంతో పోల్చితే రూ.కోటి తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఖజానా టార్గెట్ రూ.కోటి

గతంలో కంటే దరఖాస్తుదారులు తగ్గడానికి దరఖాస్తు ఫీజు పెంచడమేనని ముందు నుంచి అందరిలో చర్చ ఉంది. అయితే కనీసం గత టెండర్‌లో వచ్చిన ఫీజులు వచ్చిన బాగుండేదని అబ్కారీ అధికారులు ముచ్చటించిన సందర్భాలు ఉన్నాయి. తక్కువగా వచ్చిన రూ.కోటి టార్గెట్‌గా గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఎక్సైజ్ శాఖ ఏదో ఒక కారణాన్ని సాకుగా చూపి దరఖాస్తు చేసుకునే గడువును పొడగించారు. ఈనెల 23వ తేదీ వరకు టెండర్ వేయడానికి అవకాశం ఇచ్చి.. ఆదాయం పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

జీపీ ట్రాక్టర్ అదుపుతప్పి కార్మికుడు మృతి


భూమయ్య (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామ పంచాయతీ ట్రాక్టర్ అదుపు తప్పి కరెంట్ స్తంభానికి ఢీకొని జీపీ కార్మికుడు మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బస్వాపూర్‌లో శనివారం రాత్రి జీపీ ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా, ట్రాక్టర్‌పైన ఉన్న మల్టీపర్పస్ వర్కర్ దాచారం భూమయ్య (55), గొడిసెల అనితకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను పంచాయతీ కార్యదర్శి వేణు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భూమయ్యను కరీంనగర్ తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అనితకు సిరిసిల్లలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా మృతుడు భూమయ్యకు ఇద్దరు భార్యలు, కూతురు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు పోగుచేసి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖిలా చూసేందుకు వచ్చి.. ప్రమాదం బారిన పడి

- మొలంగూర్ ఖిలాపై విరిగిన పర్యాటకురాలి కాలు

శంకరపట్నం: శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిలా సందర్శనకు వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన పర్యాటకురాలు అదుపుతప్పి పడిపోవడంతో కాలు విరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన దంపతులు ఆరుమాసాలుగా వివిధ పర్యాటన ప్రదేశాలు సందర్శిస్తున్నారు. ఆదివారం మొలంగూర్ ఖిలాకు వచ్చారు. ఖిలా కింద దూద్ బావిని పరిశీలించారు. ఖిలా పైకి వెళ్లి అందాలు వీక్షిస్తున్న క్రమంలో అదుపుతప్పి పడిపోయింది. కాలు విరగడంతో గ్రామానికి చెందిన 10మంది యువకులు పైకి వెళ్లి సుమారు మూడు గంటల పాటు కష్టపడి మహిళను కిందకు మోసుకొచ్చారు. 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.


ప్రమాదంలో గాయపడిన పర్యాటకురాలు

ఈడబ్ల్యూఎస్ తరహాలో బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలి

- బీజేపీ మంత్రులు, ఎంపీలు అధిష్టానాన్ని ఒప్పించాలి
- సిరిసిల్లలో మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్లటౌన్: ఈడబ్ల్యూఎస్‌కు రానియాభై శాతం అడ్డు బీసీ రిజర్వేషన్లకు ఎలా ఆపాదిస్తారని బీజేపీ నాయకులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. సిరిసిల్లకు ఆదివారం వచ్చిన ఆయనను స్థానిక కాంగ్రెస్ నేతలు ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొన్నం మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మోకాలడ్డుతుందని విమర్శించారు. తమిళనాడులో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న పీవీ నరసింహరావు ప్రభుత్వం ప్రజల ఆకాంక్ష మేరకు సానుకూలంగా స్పందించిన విషయాన్ని బీజేపీ సర్కారు గుర్తెరుగాలన్నారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డితోపాటు బీజేపీ ఎంపిలు, పార్టీ జిల్లా అధ్యక్షులు అందరూ కలిసి అధిష్టానాన్ని ఒప్పించాలని కోరారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, టీపీసీసీ అబ్జర్వర్ సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, కత్తెర దేవదాసు, సూర దేవరాజు, గోలి వెంకటరమణ, ఆడెపు ప్రభాకర్ పాల్గొన్నారు.

వెలుగుల దీప్తి.. ఆలోచనల స్ఫూర్తి

- చిమ్మచీకట్లను పారదోలే పండుగ
- నేడు దీపావళి

విద్యానగర్(కరీంనగర్): కోటి వెలుగుల కాంతి.. కొత్త ఆలోచనలకు స్ఫూర్తి దీపావళి. నిశీధి నిశ్శబ్దాన్ని బాణసంచాతో బెదరగొట్టి చిమ్మ చీకట్లను చెల్లాచెదురు చేసే ఆ సంబరం దీపావళికే సొంతం.

వెలుగుల పండుగ

'తమసోమా జ్యోతిర్గమయా' అనే ఉపనిషత్ వ్యాక్యానికి ఆచరణరూపం దీపావళి. దీపావళి పర్వదినానికి యుగాల చరిత్ర ఉంది. ఇల్లంతటినీ దీపాలతో అలంకరించేది ఈ పండుగ రోజు మాత్రమే. ఆధునికత ఎంతో పెరిగినా దీపావళి రోజు ప్రమిదలో వత్తి వేసి నూనె పోసి ఆ దీపాల్నే వెలిగిస్తాం.

ఇతర దేశాల్లో దీపావళి

జపాన్‌లో కోరా నాగోషి పేరుతో దీపాల పండుగను పితృదేవతల సంస్మరణార్థం జరుపుతారు. చైనాలో హయివో హోవా పండుగలో పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తారు. నేపాల్‌లో ఆహారం ఐదురోజుల పండుగ. మొదటిరోజు కాకుల పండుగ, రెండో రోజు కోతుల పండుగ, మూడోరోజు ఆవుల పండుగ, నాల్గోరోజు దీపాలు వెలిగించి బాణసంచా పేలుస్తారు. చివరిరోజు ఆడపడుచుల పండుగ. ఇజ్రాయిల్ వారి స్వాతంత్య్ర వీరుడు మెకాచ్చిన్ స్మృత్యర్థం హనుకా అనే దీపోత్సవం జరుపుతారు.



ఈజిప్టులో ఓ సిరీస్ మరణానికి చిహ్నంగా ఇంటింటా దీపాలు వేలాడగడతారు. అమెరికాలో నవంబరు 1న హాల్‌వీన్ అనే పేర దీపావళి వంటి పండుగ జరుగుతోంది. క్రైస్తవులు జరుపుకునే క్యాండిల్ ఫెస్టివల్ దీపావళి లాంటిదే. ముస్లిం దేశాల్లోనూ దీపావళి పండుగ ఉన్నది. మహ్మద్ పైగంబరు నూతన సంప్రదాయాన్ని స్థాపించి మక్కాకు తిరిగి వెళ్లిన రాత్రికది సూచిక. దీనిని షబ్ ఎ బారత్ అంటారు. ఆ రోజు బాణసంచా పేల్చారట.

వివిధ రాష్ట్రాల్లో..

రాష్ట్రాల వారీగా దీపావళి గురించి చెప్పుకుంటే గుజరాత్‌లో లక్ష్మీపూజ, గణపతిపూజ, కర్నాటకలో బలిపాడ్య పండుగ, బెంగాల్, ఒడిశాలో కాళీపూజ, శక్తిపూజ, ఇతర రాష్ట్రాల్లో గోవర్ధనపూజ, యమద్వితీయ, భయ్యదూజ్ పండుగలు దీపావళితోనే ముడిపడి ఉన్నాయి. దీపావళి ముందు రోజును నరక చతుర్ధశిగా దీన్ని పిలుస్తున్నారు.

టపాసులతో భద్రం

విద్యానగర్(కరీంనగర్): దీపావళి అంటేనే భిన్నమైన పండుగ. వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ బాణాసంచా కాల్చడానికి ఉత్సాహం చూపుతారు. కాగా అతి ఉత్సాహంలో టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్తతో ప్రమాదాలను కోరి తెచ్చుకుంటూ ఆస్పత్రుల పాలవుతుంటారు. ముఖ్యంగా పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జాగ్రత్తలు పాటించాలి.

భారీ శబ్దాల బాంబులు

ప్రస్తుతం దీపావళి అంటే బాంబులు, టపాసుల పేలుళ్లతో వీధులన్నీ దద్దరిల్లిపోతున్నాయి. హైడ్రోజన్, సుత్తిలీ, లక్ష్మి, శివాజీ, డబుల్ సౌండ్స్, ట్రిబుల్ సౌండ్స్ వంటి పేర్లతో భారీ శబ్దాలు పుట్టించే బాంబులు తయారవుతున్నాయి. ధాం.. ధాం అంటూ పేలే బాంబుల మోతలతో చెవులు దిమ్మెక్కెతున్నాయి. పరిమితికి మించిన శబ్దాలను విని, కాలిన గాయాలకు చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగినా జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేక జీవితాంతం బాధపడుతూనే ఉంటారు. ఈ పరిస్థితులు రాకుండా తగిన జాగ్రత్తలతో పండుగను జరుపుకోవడం ఉత్తమం.

అత్యవసర ఫోన్ నంబర్లు	
ఫైర్ స్టేషన్	101
అంబులెన్స్	108
పోలీస్ కంట్రోల్ రూం	100

టపాసులు కాల్చడంలో జాగ్రత్తలు

- నాణ్యమైన బ్రాండ్లకు చెందిన బాణాసంచా కొనుగోలు చేయాలి. రాకెట్లు, ఆకాశంలోకి దూసుకెళ్లే టపాసులను గుడిసెలు, గడ్డివాములు లేని ప్రదేశాల్లో కాల్చాలి.



- కాకరకొవ్వొత్తులు, విష్ణు చక్రాలు, భూచక్రాల వంటివి శరీరానికి దూరంగా ఉంచి కాల్చడం మంచిది. రాకెట్లు కాల్చేటప్పుడు వాటిని సీసాలో పెట్టి నిటూరుగా ఉండేలా సరి చూసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించాలి. చిన్నారులు కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండాలి.

గుండెజబ్బుల వారు జాగ్రత్తగా ఉండాలి



దీపావళి పండుగలో ఎంత సరదా ఉందో ప్రమాదం కూడా అంతే ఉంది. గుండెజబ్బులున్న వారు భారీ శబ్దాలకు దూరంగా ఉండాలి. హార్ట్ అటాక్ వచ్చి కోలుకున్నవారు, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ శబ్దాల వల్ల గుండె ఎక్కువగా కొట్టుకోవడం, బీపీ పెరగడం వంటివి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ జి.వెంకట్‌రెడ్డి, జనరల్ మెడిసిన్, కరీంనగర్

గాయాలపై నీరు పోయాలి



టపాసులు కాల్చే సమయంలో గాయమైతే వెంటనే కాలిన గాయాలపై నీరు పోయాలి. ఎందుకంటే టపాసుల్లో ఉండే రసాయనాలు రక్తంలో కలిసి మరింత ప్రమాదానికి దోహదం చేస్తాయి. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. బర్నాల్, సిల్వర్ సల్ఫెడైటేన్, ఫౌండేర్, అయోడిన్ లాంటి క్రీమ్‌లను దగ్గర ఉంచుకోవడం మంచిది.

– డాక్టర్ వి.సుమన్‌చందర్‌రావు, చర్మవ్యాధుల నిపుణుడు, కరీంనగర్

ప్రాథమిక చికిత్స చేయొద్దు



మనిషి వినికిడి శక్తి 20 నుంచి 60 డెసిబుల్స్ మాత్రమే. ప్రస్తుతం లభిస్తున్న బాంబులు 100 నుంచి 180 డెసిబుల్స్ శబ్దం చేసేవి. ఒక వేళ చెవి నొప్పి వచ్చినా, చెవి నుంచి రక్తం వచ్చినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చెవిలో నీళ్లు, నూనె, ఇతర చెట్ల ఆకుల రసం పోయడం వంటివి చేయకూడదు.

– డాక్టర్ సీహెచ్.రమణాచారి, ఈఎన్‌టీ నిపుణుడు, కరీంనగర్

సాయుధ రైతాంగ పోరాట వీరుడు లచ్చన్న

- అంతిమయాత్రలో ఎర్రజెండాలతో నినాదాలు


లచ్చన్న (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల రైతాంగ సాయుధ పోరాటంలో కామ్రేడ్ లచ్చన్న చురుకైన పాత్ర పోషించారని సీపీఐ రాష్ట్ర నాయకుడు గుంటి వేణు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో శనివారం అనారోగ్యంతో మృతిచెందిన తాళ్లపల్లి లచ్చన్న(75) అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. అంతిమయాత్రలో దారిపొడవునా కామ్రేడ్ లచ్చన్న అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, బాల్యంలోనే లచ్చన్న ముంబాయ్ వెళ్లి విప్లవ కార్మికవర్గ నాయకుడిగా ఎంతోమందిని ఉద్యమమం వైపు నడిపించారన్నారు. తాను పని చేస్తున్న కంపెనీలో యూనియన్ ఏర్పాటు చేసి తొలుత ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రజా సంఘాల నాయకులు లచ్చన్న మృతదేహంపై ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు తెలిపారు. 'తరమెల్లి పోతుంది.. త్యాగాల స్వారాగం.. ఆగిపోతుంది.. ఓ వీరులారా.. ఓ సూరులారా.. వందనాలు.. ఎర్ర వందనాలు'.. అంటూ విప్లవ గీతాలు ఆలపించి లచ్చన్నకు చివరి వీడ్కోలు పలికారు. అరుణోదయ కళాకారిణి విమలక్క సెల్ ఫోన్ ద్వారా విప్లవ సందేశాన్ని అక్కడికి వచ్చిన వారందరికీ వినిపించారు. ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

స్వగ్రామానికి మృతదేహాలు


ప్రకాశ్(ఫైల్)

రామడుగు/మేడిపల్లి: ఉపాధి కోసం ఒకరు.. ఉన్నత చదువుల కోసం మరొకరు విదేశాలకు వెళ్లి.. ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, వారి మృతదేహాలను ఆదివారం స్వగ్రామాలకు తీసుకొచ్చారు. వివరాలు.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎలగుండుల ప్రకాశ్ (35) కొద్దిరోజులుగా దుబాయ్‌లో కంపెనీలో కాకుండా కలివెల్లిగా జీవనం సాగించాడు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడం కష్టంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు, బీఆర్‌ఎస్ నాయకులు పూడురి మల్లేశం, దుబాయి ఎల్లాల శ్రీనన్న సేవా సమితి సభ్యులు చిలుముల రమేశ్‌కు తెలిపారు. ఈక్రమంలో రమేశ్ సేవా సమితి అధ్యక్షుడు రవిడేవిడ్‌కు తెలియజేయడంతో దుబాయ్‌లోని ఇండియన్ అసోసియేషన్ వారితో మాట్లాడారు. దీంతో ప్రకాశ్ మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకురాగా, పలువురు శ్రద్ధాంజలి ఘటించారు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి..


మహేందర్‌రెడ్డి (ఫైల్)

లండన్‌లో ఈనెల 3న గుండెపోటుతో చనిపోయిన జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన ఏనుగు మహేందర్‌రెడ్డి (26) మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన మహేందర్‌రెడ్డి విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతడి తండ్రి రమేశ్‌రెడ్డి కాంగ్రెస్ మేడిపల్లి మండల అధ్యక్షుడు కావడంతో పెద్దసంఖ్యలో ప్రజలు, ప్రముఖులు మహేందర్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం


తిరుపతి (ఫైల్)

చందుర్తి(వేములవాడ): బతుకమ్మ ఆట చూసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు 20 రోజులకు పాడుబడిన వ్యవసాయ బావిలో కుళ్లిన స్థితిలో కనిపించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టేల తిరుపతి (30) గత నెల 29న సద్దుల బతుకమ్మ ఆట చూసి వస్తానని తల్లి భాగ్యవ్వకు చెప్పి వెళ్లాడు. 24 గంటలు గడిచినా కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో అదే నెల 30న భాగ్యవ్వ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా జోగాపూర్ పక్క గ్రామం కిష్టంపేటకు చెందిన పూదూరి బాపురావు వ్యవసాయ బావిలో కుళ్లిన స్థితిలో తిరుపతి మృతదేహం లభ్యమైంది. బాపురావు చిన్న కుమారుడు మహేశ్ బావికి సమీపంలో గేదెను కట్టేసేందుక వెళ్లగా కుళ్లిన మృతదేహంపై షర్టు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా తిరుపతి కొద్దిరోజులుగా మతి స్థిమితం సరిగా లేక బావిలో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు, గ్రామస్తులు భావిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వచ్చిన బ్లూకోల్ట్స్ సిబ్బందికి ఇసుక స్మగ్లర్ చుక్కలు చూపించాడు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించేందుకు పోలీస్ సిబ్బంది అరగంట సేపు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో చివరికి ఏఎస్సై వచ్చి సదరు ఇసుక రవాణాదారుడిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన వివరాలు స్థానికులు తెలిపిన కథనం ప్రకారం. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన ఒకరు తన ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించకుండా యజమాని అడ్డుకోవడంతో అరగంటకు పైగా చిన్నపాటి డ్రామ చోటుచేసుకుంది. యజమాని సహకరించకపోవడంతో చివరికి ఏఎస్సై చంద్రశేఖర్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో వచ్చి పోలీసు వాహనం సహాయంతో లింగంపేటకు వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని ఓ అధికార పార్టీ నేతకు సదరు ట్రాక్టర్ యజమాని ఫోన్‌చేయగా, ఇప్పటికే మూడు సార్లు విడిపించానని.. ఇక తనతో కాదని ఫోన్ పెట్టేసినట్లు చర్చ సాగుతోంది.

గల్ఫ్‌లో గొల్లపల్లి వాసి మృతి


శ్రీకాంత్‌గౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన ఆకుల శ్రీకాంత్‌గౌడ్(35) అనే యువకుడు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ గల్ఫ్‌లో ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటన స్వగ్రామంలో విషాదం నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీకాంత్‌గౌడ్ కొంతకాలంగా గల్ఫ్ దేశాలకు బతుకుదెరువు కోసం వెళ్తున్నాడు. మొదట అఫ్గానిస్థాన్‌కు వెళ్లిన శ్రీకాంత్‌గౌడ్ ప్రస్తుతం ఒమన్ దేశంలో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం గల్ఫ్ నుంచి ఇంటికొచ్చి తిరిగి వెళ్లాడు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. శ్రీకాంత్‌గౌడ్ మృతి చెందిన సమాచారాన్ని అక్కడ మిత్రులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఒక్కగానొక్క ఒక్క కొడుకు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి తల్లిదండ్రులు లక్ష్మి–అంజాగౌడ్ ఇద్దరు సోదరీలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.